అర్ధరాత్రి దొంగల హల్‌చల్

- ఇంటివారు ఉండగానే లూటీ
- 32 తులాల బంగారు నగలు, కిలో వెండి చోరీ

కాలనీలోని సీసీ కెమెరాలకు చిక్కిన దుండగుల అనవాళ్లు

వినాయక్‌నగర్, నవంబర్11: జిల్లా కేంద్రంలోని వినాయక నగర్ ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి అనంతరం దొంగలు హల్‌చల్ చేశారు. వినాయక నగర్-100 ఫీట్స్ రోడ్డు చివరిలో దత్రాత్రేయ మందిరం వెనకాల కాలనీలోకి అర్ధరాత్రి అనంతరం 1.50 గంటలకు చేరుకున్నారు. ముందుగా ఓ ఇంట్లో చోరీకి యత్నించి విఫలమయ్యారు. అదే ఏరియాలో ఉన్న లక్కరసు రాములు అనే వ్యాపారి దంపతులు బెడ్ రూమ్‌లో నిద్రిస్తున్నారు. ఆ ఇంటి మరో గది కిటికీ తలుపులు తెరిచి దానికి ఉన్న గ్రిల్‌ను తమ వెంట తెచ్చుకున్న స్క్రూ డ్రైవర్‌తో తొలగించారు. కిటికీ లోంచి గదిలోకి దిగిన దుండగులు దంపతులు నిద్రిస్తున్న బెడ్ రూమ్‌కు బయటి నుంచి గడియపెట్టి మరో గదిలోకి వెళ్లారు. బీరువాను ధ్వంసం చేసి అందులోని 32 తులాల బంగారు ఆభరణాలతో పాటు కిలో వెండిని దోచుకొని పారిపోయారు. ఉదయం తమ గదికి గడియ వేసి ఉండటంతో బాధితులు పక్కింటి వారిని పిలిచి బయటికి వచ్చారు. ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని ఫోర్త్ టౌన్ ఎస్సై శ్రీకాంత్ పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. దుండగుల ఆనవాళ్లు కాలనీలోని ఓ ఇంటి సీసీ కెమెరాలకు చిక్కాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చెప్పటిన్నట్లు ఎస్సై వెల్లడించారు.

70 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత

వినాయక్‌నగర్, నవంబర్11: నిజామాబాద్ నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న మినీ ట్రక్కును సోమవారం అజాంకాలనీ ఏరియాలో పోలీసులు పట్టుకున్నారు. 70 బస్తాల బియ్యం తరలిస్తున్న అమీర్ అహ్మద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన బియ్యం వాహనంతో పాటు నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

విచ్చలవిడిగా ఇసుక డంపులు

పట్టించుకునేవారే కరువు

ఇసుక డంపులు

వేల్పూర్, నవంబర్ 11 : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో విచ్చలవిడిగా ఇసుక డంపులు దర్శనమిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో పలువురు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను గ్రామంలోని పలు ప్రాంతాల్లో డంపు చేస్తున్నారు. మరుసటి రోజున ఇసుకను లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో ఇసుక డంపులు వేస్తున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీసులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంకటాపూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉన్న ఇసుక డంపులను సీజ్ చేయాలని కోరుతున్నారు.

మహిళల భద్రతకు చర్యలు తీసుకోవాలి

ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ

మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీపీ

వినాయక్‌నగర్, నవంబర్ 11: మహిళల భద్రతకోసం చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి కమిషనర్ ఆఫ్ పోలీస్ సింధూశర్మ సూచించారు. సోమవారం పోలీస్ కమిషరేట్‌లో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల ఏసీపీ, సీఐలతో సమీక్ష నిర్వహించారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహించాలని, బీట్లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు డీసీపీలు కోటేశ్వర రావు, బస్వారెడ్డి పాల్గొన్నారు.

విధులపై నిర్లక్ష్యం.. ఆర్ఐపై బదిలీ వేటు

పోతంగల్, నవంబర్ 11: రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిలుపై బదిలీ వేటు పడింది. ఈనెల 4న పోతంగల్ ఆర్ఐ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ స్థానికులు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సాయిలును బోధన్ ఆర్డీవో కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో భాస్కర్ వస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. భాస్కర్ చందూర్‌లో విధులు నిర్వహించారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఖలీల్‌వాడి, నవంబర్ 11: ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. కార్గో సేవలకు సంబంధించిన కరపత్రాలను జిల్లా కేంద్రంలో సోమవారం పంపిణీ చేశారు. హైదరాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్‌కు సంబంధించిన 30 కౌంటర్లలో (సిటీ పరిసరాల చుట్టూ) వస్తువులను కస్టమర్లకు హోమ్ డెలివరీ చేస్తున్నట్లు తెలిపారు. 0 నుంచి 1 కేజీకి రూ.50, 1 నుంచి 5 కేజీలకు రూ.60, 5-10 కేజీలకు రూ.65, 10-20 కేజీలకు రూ.70, 20-30 కేజీలకు రూ.75, 30 కేజీలకంటే ఎక్కువ ఉంటే 75 చార్జి చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు ఆర్మూర్-7396889496, బోధన్-9014296638, నిజామాబాద్-1 డిపో-9154298727, 2డిపో-7396889496, బాన్సువాడ - 9154298729, కామారెడ్డి - 9154298729, ఆర్ఎం ఆఫీస్ - 8639963647 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నిధులు మంజూరు

వినాయక్‌నగర్, నవంబర్11: జిల్లాలోని పలు మండలాల్లో పోస్టాఫీసులకు నూతన భవనాల నిర్మాణానికి కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా నిధులు మంజూరు చేశారని ఎంపీ ధర్మపురి అర్వింద్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. భీమ్‌గల్ పట్టణంతోపాటు బాల్కొండ, నందిపేట మండలాలకు భవనాలు మంజూరైనట్లు తెలిపారు.

బియ్యం పక్కదారి

వర్ని, నవంబర్11: రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. వర్ని మండలంలోని హుమ్నాపూర్, పాతవర్ని గ్రామాల్లో ఆటోలో తిరుగుతూ ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారు. బియ్యాన్ని పక్కదారి పట్టకుండా అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

సారంగపూర్‌లోని విజయ డెయిరీ కార్యాలయం

'విజయ'లో పాల వెల్లువ

- బీఆర్ఎస్ హయాంలో డెయిరీల అభివృద్ధి
- జిల్లాలో ప్రస్తుతం రోజుకు 8500 లీటర్ల పాల సేకరణ
- 15వేల లీటర్ల పాల సేకరణే లక్ష్యంగా ప్రణాళిక
- పాడి పరిశ్రమపై చిన్న, సన్నకారు రైతుల ఆసక్తి

సారంగాపూర్, నవంబర్ 11 : జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నది. గడిచిన పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ రంగంతోపాటు దానికి అనుబంధంగా ఉన్న పాడి పరిశ్రమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిన ఫలితంగా చిన్న, సన్నకారు రైతులు, సాధారణ వర్గ ప్రజలు గేదెలు, ఆవుల పెంపకంపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు వివిధ సంక్షేమ పథకాలను అమలుచేయడంతో త్వరితగతిన ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఆదాయమార్గంగా ఎన్నుకొన్నారు. ఈ నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాలోని వినియోగదారులకు స్వచ్ఛమైన (నాణ్యమైన) పాలు అందించే లక్ష్యంతో నగర శివారులోని సారంగాపూర్‌లో ఉన్న నిజామాబాద్ విజయ డెయిరీ అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. అధికంగా పాల ఉత్పత్తి సాధన కోసం అనుసరించాల్సిన విధానాలు, పాటించాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడూ రైతులకు అవగాహన కల్పిస్తూ, చైతన్యపర్చే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

రోజుకు 8500 లీటర్ల పాల సేకరణ

నిజామాబాద్ జిల్లాలో 2500 మంది పాడి రైతుల నుంచి ప్రస్తుతం రోజుకు 8500 లీటర్ల పాలను విజయ డెయిరీ కేంద్రాల ద్వారా సేకరిస్తున్నారు. గత ఆగస్టులో మూడు వేల లీటర్ల పాలను సేకరించగా, ప్రస్తుతం 5500 లీటర్ల పాల సేకరణ అదనంగా పెరిగింది. సేకరించిన పాలను సారంగాపూర్ వద్ద ఉన్న విజయ డెయిరీ ద్వారా విక్రయాలు చేపడుతున్నారు. ప్రతి రోజూ 8500 లీటర్ల పాలను సేకరిస్తుండగా.. ఇందులో 5500 లీటర్లు 171 గురుకుల, సంక్షేమ వసతిగృహాలతోపాటు మార్కెట్‌లో ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. మిగతా 3000 లీటర్ల పాలను హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయం విజయ డెయిరీకి పంపుతున్నారు. నవంబర్‌లో ఈనే గేదెల సంఖ్య మరింతగా పెరగనుండడంతో పాల ఉత్పత్తి కూడా పెరిగే అవకాశం ఉంటుందని విజయ డెయిరీ అధికారులు భావిస్తున్నారు. ఈసారి రోజుకు 15 వేల లీటర్ల పాల సేకరణ జరిగేలా లక్ష్యాన్ని నిర్దేశించుకొని, ఆ దిశగా కృషి చేసేందుకు ప్రణాళికను రూపొందించుకున్నారు.

పెరిగిన 300 కిలోల పెరుగు ఉత్పత్తి

విజయ డెయిరీ ద్వారా పాలతోపాటు పెరుగును కూడా ఉత్పత్తి చేస్తున్నారు. అన్‌సీజన్‌లో రోజుకు 200 కిలోల పెరుగు ఉత్పత్తి చేస్తుండగా, ప్రస్తుతం 300 కిలోల పెరుగును ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నారు. రోజుకు వెయ్యి కిలోల పెరుగు ఉత్పత్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకొని కృషి చేస్తున్నారు.

సమష్టి కృషితో లక్ష్యాన్ని సాధిస్తాం

జిల్లాలో విజయ డెయిరీ కేంద్రాల ద్వారా పాల సేకరణ పెంపుదల లక్ష్యంగా రైతులు, సిబ్బంది సమష్టిగా కృషిచేస్తున్నాం. ఇందులో భాగంగా ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం(పీఎంఈజీపీ) కింద 30, 35 శాతం సబ్సిడీపై బ్యాంకు లింకేజీ ద్వారా పాడి రైతులకు గేదెల కొనుగోలు ప్రక్రియను త్వరలో ప్రారంభించనున్నాం. పాలు పోసిన రైతులకు ప్రతి 15 రోజులకోసారి బిల్లును చెల్లించాల్సి ఉంది. సెప్టెంబర్ 15 వరకు బిల్లులు చెల్లించాం.

- నాగేశ్వర్‌రావు, డిప్యూటీ డైరెక్టర్, నిజామాబాద్ విజయ డెయిరీ

విజయ డెయిరీ రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్దేశించిన పాల సేకరణ లక్ష్యసాధన కోసం కృషి చేయడంతో, ఎక్కువ పాల ఉత్పత్తి చేపట్టేందుకు శ్రమిస్తున్న పాడి రైతులకు గిట్టుబాటు ధర కూడా అందుతున్నది. గత ప్రభుత్వం లీటర్ గేదె పాలలో పది శాతం వెన్న ఉంటే రూ.80, ఆవు పాలు లీటర్‌కు రూ.40 వెచ్చించి కొనుగోలు చేస్తున్నది. ఇప్పుడు కూడా ఇదే రేటుతో కొనసాగడంతో గేదెల పెంపకం పట్ల చిన్న, సన్నకారు రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అంతేగాకుండా ప్రైవేట్ డెయిరీల కన్నా తక్కువ ధరకు విజయ డెయిరీ నాణ్యమైన పాలను వినియోగదారులకు విక్రయిస్తున్నది. రెండు నెలల క్రితం హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్‌గా ఇక్కడికి బదిలీపై వచ్చిన నాగేశ్వర్ రావు, మేనేజర్ రమేశ్ పర్యవేక్షణలో పాల ఉత్పత్తిదారుల నుంచి పాలను సేకరించి తద్వారా తయారుచేసిన ప్యాకెట్లను క్రయవిక్రయాలు జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సబ్సిడీపై పశువులకు దాణా సరఫరా

పాడి పశువులకు పోషకాహారంతో కూడిన దాణాను పెంపకందారులకు విజయ డెయిరీ ద్వారా సబ్సిడీపై సరఫరా చేస్తున్నారు. ఈ దాణా ద్వారా పాల దిగుబడి పెరగడంతోపాటు వెన్న శాతం కూడా పెరుగుతుంది. తద్వారా పాడి రైతులకు ఆదాయం కూడా ఎక్కువగా సమకూరుతున్నది. పశువుల దాణా 50 కిలోల బ్యాగ్ ధర రూ.1150 ఉండగా, పాడి రైతులకు 750 రూపాయలకే అందజేస్తున్నారు.

విదర్భలో విజేతదే మహా పీఠం

- ఇక్కడ 62 అసెంబ్లీ నియోజకవర్గాలు
- ఈ ప్రాంతంలో పట్టు సాధిస్తే అధికారం పక్కా
- ప్రత్యేక దృష్టి సారించిన రెండు కూటములు

ముంబై, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ఎన్నికలు సమీపిస్తున్న వేళ రెండు కూటములు విదర్భ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. 62 నియోజకవర్గాలు ఉన్న విదర్భలో పాగా వేస్తే అధికారానికి దగ్గరైనట్టే అని కూటములు లెక్కలు వేసుకుంటున్నాయి. ఇక్కడి ప్రజలను ఆకర్షించి మెజార్టీ సీట్లు తమ ఖాతాలో వేసుకోవాలని తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇప్పటికే రెండు కూటముల నుంచి అగ్రనేతలు విదర్భ మొత్తాన్ని చుడుతూ ప్రచారం చేస్తున్నారు. ఎక్కువగా పత్తి పండించే రైతులు ఉన్న ఈ ప్రాంతంలో రైతులు ఎటువైపు నిలుస్తారనేది గెలుపోటములను నిర్ణయించనుంది.

రెండు కూటములకూ కీలకం

విదర్భలోని మొత్తం 62 స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ 36 స్థానాల్లో ప్రత్యక్షంగా తలపడుతున్నాయి. 11 జిల్లాలు కలిగిన విదర్భ ప్రాంతం 1990ల వరకు కాంగ్రెస్‌కు కంచుకోట. మూడు దశాబ్దాలుగా ఇక్కడ బీజేపీ - శివసేన కూటమి పట్టు పెంచుకుంది. 2014లో ఇక్కడ బీజేపీ ఒంటరిగా పోటీ చేసి 44 స్థానాలను గెలుచుకుంది. 2019లో 29 స్థానాలకు పడిపోయింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) ఇక్కడ మంచి ఫలితాలను సాధించింది. విదర్భలోని 10 లోక్‌సభ స్థానాల్లో ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో విదర్భలో పాగా వేసేందుకు ఎంవీఏ ప్రయత్నిస్తున్నది. ఆరెస్సెస్ కేంద్ర కార్యాలయం విదర్భలోనే నెలకొని ఉండటం, రాష్ట్ర బీజేపీకి జోడుగుర్రాల్లాంటి దేవేంద్ర ఫడ్నవీస్, చంద్రశేఖర్ బవాంకులే ఈ ప్రాంతానికి చెందిన వారే కావడంతో బీజేపీ ఈసారి విదర్భ ప్రాంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది.

మేఘాల్లోనూ మైక్రోప్లాస్టిక్

- పర్యావరణాన్ని ప్రభావితం చేస్తుండొచ్చు
- శాస్త్రవేత్తల ఆందోళన

న్యూఢిల్లీ: భూమిని మొత్తం ఆక్రమించేసిన మైక్రోప్లాస్టిక్స్ మేఘాల్లోకీ చేరాయని, ఇవి పర్యావరణాన్ని సైతం ప్రభావితం చేస్తుండొచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు చేసిన ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆకాశంలో మైక్రోప్లాస్టిక్‌లు మంచు కేంద్రక రేణువులుగా పని చేసి అసహజంగా మేఘాల ఏర్పాటుకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. సాధారణంగా మేఘాలు ఏర్పడే పరిస్థితులు లేకపోయినా మైక్రోప్లాస్టిక్‌లు మేఘాలు ఏర్పడేలా చేస్తాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని నిర్ధారించడం కోసం పరిశోధకులు నాలుగు రకాల మైక్రోప్లాస్టిక్‌లను ప్రయోగశాలలో పరీక్షించారు. ఇందుకోసం నీటి బిందువులను చల్లబరిచి మంచుగా మార్చారు. మైక్రోప్లాస్టిక్ లేని నీటి బిందువులు మైనస్ 38 డిగ్రీల సెల్సియస్ వద్ద గడ్డ కట్టగా, 50 శాతం మైక్రో ప్లాస్టిక్‌లతో కలుషితమైన నీటి బిందువులు మైనస్ 22 డిగ్రీల సెల్సియస్ వద్దనే గడ్డ కడుతున్నట్టు తెలుసుకున్నారు. కాబట్టి మైక్రో ప్లాస్టిక్‌లు మేఘాల నిర్మాణాన్ని ప్రభావితం చేస్తున్నాయని అర్థమవుతున్నదని శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఫ్రీడ్‌మన్ తెలిపారు.

ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా రాకెట్ల వర్షం

90కి పైగా క్షిపణుల ప్రయోగం • పలువురికి గాయాలు • ధ్వంసమైన వాహనాలు

బీరుట్, నవంబర్ 11: ఇజ్రాయెల్-హెజ్బొల్లా మధ్య పోరు మరింత తీవ్రరూపం దాల్చింది. లెబనాన్‌లోని హెజ్బొల్లా గ్రూప్ సోమవారం ఇజ్రాయెల్‌పై వరుస రాకెట్ దాడులతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్ నగరం 'హైఫా' లక్ష్యంగా 90కిపైగా క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో హైఫాలో పలు భవనాలు దెబ్బతిన్నాయని, పలువురు గాయపడ్డారని, వాహనాలు ధ్వంసమయ్యాయని మీడియా కథనాలు పేర్కొన్నాయి. హెజ్బొల్లా ప్రయోగించిన పలు మిస్సైల్స్‌ను ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ 'ఐరన్ డోమ్' అడ్డుకున్నప్పటికీ, మరికొన్ని హైఫాలో పలు జనావాస ప్రాంతాల్ని తాకాయని తెలిసింది. ఒక చిన్నారి సహా నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారని ప్రాథమిక సమాచారం. హెజ్బొల్లా రాకెట్ దాడుల్ని ఇజ్రాయెల్ భద్రతా బలగాలు (ఐడీఎఫ్) ధ్రువీకరించాయి. హైఫా పట్టణం శివారు ప్రాంతాల్ని మిస్సైల్స్ తాకాయని ఐడీఎఫ్ పేర్కొన్నది.

హెజ్బొల్లా రాకెట్ దాడులతో ఇజ్రాయెల్‌లోని హైఫాలో దహనమవుతున్న కార్లు

శ్మశానం కింద హెజ్బొల్లా సొరంగం!

హెజ్బొల్లా సభ్యులు ఉపయోగించే సొరంగాలను ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) ఆదివారం తెలిపింది. వీటిలో ఒకటి శ్మశానం కింద ఉందని ఆరోపించింది. కిలోమీటర్ పొడవున ఉండే ఈ సొరంగాలను గుర్తించామని ఎక్స్‌లో ఒక వీడియోను పోస్ట్ చేసింది. ఈ సొరంగాల్లో కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్స్, నిద్రించే గదులు, ఆయుధగారాలు ఉన్నట్టు ఐడీఎఫ్ వెల్లడించింది. ఓ సొరంగంలో డజన్ల కొద్దీ ఆయుధాలు, ఇతర సైనిక సామగ్రి ఉన్న వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'ఉగ్రవాదుల అండర్ గ్రౌండ్ సొరంగాలను మా దళాలు ధ్వంసం చేశాయి. అందులో వ్యూహాత్మకంగా శ్మశానం కింద కూడా ఒకటి ఉంది. హెజ్బొల్లా మనుషులు చనిపోయినా, బతికున్నా వారికి విలువ ఇవ్వదు' అని ఐడీఎఫ్ విమర్శించింది.

ఇరాన్ రసాయన ఆయుధాల అభివృద్ధి!

ఇజ్రాయెల్ సైనికులు, పౌరులపై ప్రయోగించేందుకు ఇరాన్ రసాయన ఆయుధాల్ని సిద్ధం చేసిందన్న వార్తలు వెలువడ్డాయి. ఔషధ తయారీలో రసాయన ఏజెంట్స్‌గా వాడే సింథటిక్ ఓపియాయిడ్లు, ఫెంటానేల్.. వంటి వాటితో ఇరాన్ రసాయన ఆయుధాల్ని అభివృద్ధి చేసిందని అమెరికా రక్షణ రంగ నిపుణుడు మాథ్యూ లెవిట్ వెల్లడించారు. శక్తివంతమైన రసాయన ఏజెంట్స్‌తో గ్రనేడ్లు, బాంబులను ఇరాన్ తయారుచేసిందని, వీటి ప్రభావానికి లోనైతే.. బాధితుల నాడీ వ్యవస్థ కొన్ని క్షణాల్లో దెబ్బతింటుందని తెలిపారు. ఇజ్రాయెల్ సైన్యం, పౌరులు లక్ష్యంగా ఈ రసాయన ఆయుధాల్ని ప్రయోగించేందుకు ఇరాన్ తయారు చేసిందని చెప్పారు. దీనిపై ఆయన రాసిన ఆర్టికల్ చర్చనీయాంశమైంది. ఇరాన్ రసాయన ఆయుధాల తయారీని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదని హెచ్చరించారు. రసాయన ఆయుధాల నుంచి వెలువడే పొగను ఒకసారి పీల్చిగానే, బాధితులు వెంటనే స్పృహ కోల్పోతారని, ఇజ్రాయెల్ సైనికులు, పౌరులను బందీలుగా చేసుకోవడానికి ఇరాన్ వాడొచ్చునని చెప్పారు.

భగత్‌సింగ్ ఓ ఉగ్రవాది: పాక్

లాహోర్: బ్రిటిష్ వలస పాలకులపై వీరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్ పట్ల పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రభుత్వం దురహంకారంతో వ్యవహరించింది. ఆయనను గౌరవించేందుకు తిరస్కరించింది. షడ్మన్ చౌక్‌కు భగత్ సింగ్ పేరు పెట్టడాన్ని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించింది. భగత్ సింగ్‌ను ఉగ్రవాదిగా పేర్కొనడంపై ఆమ్ ఆద్మీ పార్టీ ఘాటుగా స్పందించింది. దీనిపై పాకిస్థాన్‌ను వివరణ కోరాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బీజేపీ స్పందిస్తూ, పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తున్న విషయం అందరికీ తెలుసునని పేర్కొంది. భగత్ సింగ్‌ను అపఖ్యాతిపాలు చేయడం కోసం పాకిస్థాన్ నయవంచనకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేసింది.

హారిస్‌ను అధ్యక్షురాలిని చేయాలి

బైడెన్ వైదొలగాలని డిమాండ్లు

వాషింగ్టన్, నవంబర్ 11: అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్ ఓటమి డెమొక్రటిక్ నేతల్ని తీవ్రంగా నిరాశపర్చింది. ఎన్నికల్లో ఓడిపోయినా.. కమలా హారిస్‌ను ప్రెసిడెంట్‌ను చేయవచ్చునని డెమొక్రటిక్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించేవరకు కమలాహారిస్‌కు పదవి అప్పగించాలని ఆమె మాజీ కమ్యునికేషన్స్ వ్యవహారాల డైరెక్టర్ జమాల్ సిమన్స్ బైడెన్‌కు సూచించారు. 'జో బైడెన్ గొప్ప అధ్యక్షుడు. అయితే ఆయన చేసిన వాగ్దానం.. నెరవేర్చాల్సి ఉంది. తన పదవికి రాజీనామా చేసి, కమలా హారిస్‌కు బాధ్యతలు అప్పగించాలి. తద్వారా అమెరికాకు తొలి మహిళా అధ్యక్షురాలిగా కమలా హారిస్ నిలుస్తారు' అని అన్నారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం, కొత్త అధ్యక్షుడిగా ట్రంప్ వచ్చే ఏడాది జనవరిలో బాధ్యతలు స్వీకరిస్తారు. దీనికి కొన్ని వారాల సమయముంది. అయితే బైడెన్ తన వాగ్దానాన్ని నెరవేర్చేందుకు మరో 30 రోజులు చాలని సిమన్స్ గుర్తుచేశారు.

ఉక్రెయిన్‌తో యుద్ధం తీవ్రం చేయొద్దు

- ఫోన్‌లో పుతిన్‌కు ట్రంప్ సూచన
- ఖండించిన క్రెమ్లిన్ వర్గాలు

వాషింగ్టన్: ఉక్రెయిన్‌తో చేస్తున్న యుద్ధం మరింత తీవ్రతరం చేసుకోవద్దని రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు డొనాల్డ్ ట్రంప్ సూచించారట! యూరప్‌లో అమెరికా సైనిక ఉనికి గణనీయంగా ఉందన్న సంగతి పుతిన్‌కు గుర్తుచేశారట. ట్రంప్-పుతిన్ మధ్య ఫోన్ సంభాషణలు జరిగినట్టు అంతర్జాతీయ మీడియాలో సోమవారం వార్తా కథనాలు వెలువడ్డాయి. ఉక్రెయిన్ యుద్ధం సహా పలు విషయాలు ఇరువురు మధ్య ప్రస్తావనకు వచ్చినట్టు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు ఎలా పలకాలన్నది వారిద్దరు మాట్లాడుకున్నారని 'వాషింగ్టన్ పోస్ట్' తెలిపింది. కాగా, వీటిని క్రెమ్లిన్ (పుతిన్ అధికార కార్యాలయం) వర్గాలు ఖండించాయి.

'బాకూ'లో మొదలైన కాప్-29

బాకూ, నవంబర్ 11: 'పారిస్ ఒప్పంద' లక్ష్యాలు ప్రమాదంలో పడ్డాయని, మరోవైపు 2024 ఏడాదిలో ఉష్ణోగ్రతలు సరికొత్త రికార్డులను చేరుకోనున్నాయని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచానికి పెను సవాల్‌గా మారిన వాతావరణ మార్పులను కట్టడి చేసేందుకు ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తున్న 'కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్' (కాప్)-29 సదస్సు సోమవారం అజర్ బైజాన్ రాజధాని 'బాకూ'లో ప్రారంభమైంది. ఐరాస చీఫ్ గుటెరస్, ప్రపంచ వాతావరణ సంస్థ చీఫ్ సెలెస్టీ సాలో మాట్లాడుతూ, పర్యావరణ మార్పులపై ఆందోళన వ్యక్తం చేశారు. పారిస్ ఒప్పంద లక్ష్యాలను అందుకునేందుకు ప్రపంచ దేశాలు వీలైనంత తొందరగా కదలాలని, లక్ష్యాలను విడిచిపెట్టవద్దని సెలెస్టీ సాలో ప్రపంచ దేశాలను కోరారు. నవంబర్ 11 నుంచి 22 వరకు జరగనున్న 'కాప్' సదస్సుకు వివిధ దేశాల నాయకులు, పర్యావరణ నిపుణులు హాజరవుతున్నారు. పారిస్ వాతావరణ ఒప్పందం అమలు, కాలుష్య నియంత్రణ కోసం వర్ధమాన దేశాలకు ఆర్థిక సాయం వంటి కీలక అంశాలు చర్చకు రానున్నాయి. సదస్సును ప్రారంభిస్తూ సాలో కీలక వ్యాఖ్యలు చేశారు. మంచు కరిగి, సముద్ర మట్టాలు పెరుగుతున్నాయని, అనూహ్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్నాయని, దీంతో ప్రపంచవ్యాప్తంగా సమాజం, ఆర్థికరంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.



BLOCKBUSTER నేడే చూడండి
అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
BVSN PRASAD SUDHIER VARMA
సప్తగిరి 70 ఎ